సాక్షి రంగారెడ్డి
ఆదివారం। 12। ఫిబ్రవరి। 2023



ధరణితో తంటా

కేసీఆర్ సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పెరుగుతున్నాయే కానీ పరిష్కారం కావడంలేదని రైతులు వాపోతున్నారు. 8లో▸

రాచకొండలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. కమిషనర్‌గా దేవేంద్రసింగ్ చౌహాన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీసులు బదిలీలు జరగడం ఇదే తొలిసారి. దీర్ఘకాలంగా ఒకే పోస్టింగ్‌లో ఉన్న ఏడుగురు స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు (ఎస్‌హెచ్‌ఓలు) స్థాన చలనం కల్పిస్తూ సీపీ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

డుసిమస్-2023 ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: న్యాయశాస్త్ర విద్యార్థుల డుసిమస్-2023 కార్యక్రమం ఓయూలో ప్రారంభమైంది. శనివారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికయాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భూయాన్, గౌరవ అతిథి అడ్వకేట్ జనరల్ బండ శివానందప్రసాద్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కల్చరర్ పోటీలను ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రాజీ మార్గం ఉత్తమం



లోక్ అదాలత్‌లో కక్షిదారులను ప్రశ్నిస్తున్న మెజిస్ట్రేట్

హయత్‌నగర్: క్షణికావేశంలో జరిగిన నేరాలతో కోర్టుల చుట్టూ తిరగకుండా ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకోవడం ద్వారా కేసులను మాఫీ చేసుకోవచ్చని హయత్‌నగర్‌లోని 14వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి చందన సూచించారు. కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోని మొత్తం 111 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న చిన్న తగాదాల కారణంగా కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్నాయని, దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ చేసుకుని లోక్ అదాలత్‌లలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి జయసింహ, ఏపీపీలు అరుణోదయ, కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటేశ్వర్‌రెడ్డి, బెంచ్ సభ్యులు రామ్మోహన్, ప్రవీణ్, మహాత్మ, శంకరయ్య, వేణుగోపాల్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒక్కటే

- మాజీ ఎంపీ హన్మంతరావు



మాట్లాడుతున్న హన్మంతరావు

యాచారం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అగ్రనేత చేపట్టిన జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ సర్కార్ ధరణి పోర్టల్ తెచ్చి పేద రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పేదలకు ఉన్న ఎకరా భూమికి కూడా పట్టాదారు, పాసుపుస్తకాలు రాక ఆందోళన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. రైతుబంధు పథకాన్ని ఐదెకరాల్లోపు పేద రైతులకే ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో వస్తున్న భూ సమస్యలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఏపీలో మాదిరిగా తెలంగాణలో భూముల సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి ఉన్నారు.



పోడియంపై టాప్ త్రీ విజేతలు



ఆబాల గోపాలం.. ఆనందోత్సాహం..

రైడ్.. దౌడ్

సాగర్ తీరంలో వాయువేగం ● హోరెత్తిన ఫార్ములా ఇ- రేస్

- గంటకు పైగా పరుగులు తీసిన కార్లు
- మొదట ట్రయల్ రన్, అనంతరం క్వాలిఫయింగ్
- ఉత్కంఠ రేకెత్తించిన ప్రధాన పోటీలు
- మోటార్ స్పోర్ట్స్ ప్రియుల ఆనందోత్సాహాలు

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్ తీరంలో ఇ-కార్ రేస్ హోరెత్తింది. నెక్లెస్ రోడ్డుపై మెరుపు వేగంతో పోరెత్తింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోటారు క్రీడా ప్రియులను కొన్ని గంటల పాటు హైదరాబాద్ వైపు దృష్టి మళ్లించింది. ప్రత్యక్షంగా వీక్షించిన వేలాది మంది సందర్శకులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తింది. శనివారం నెక్లెస్ రోడ్డులోని స్ట్రీట్ సర్క్యూట్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ఫార్ములా- ఇ అంతర్జాతీయ కార్ రేసింగ్ పోటీలకు సాధారణ ప్రేక్షకులతో పాటు సినీ, రాజకీయ, క్రీడా తదితర రంగాలకు చెందిన ప్రముఖులు సైతం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా భారత్‌లోనే మొదటిసారిగా నగరంలో జరిగిన ఫార్ములా - ఇ ప్రిక్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో డీఎస్ ఆటో మొబైల్స్ నుంచి పాల్గొన్న రేసింగ్ డ్రైవర్ వర్జిన్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఎన్విసాన్ నుంచి పాల్గొన్న క్యాస్ డీ ద్వితీయ స్థానంలో, డీఏ కోస్టా మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను మంత్రి కేటీఆర్ వీరిని ప్రత్యేకంగా అభినందించారు. వీరికి అవార్డులను అందజేశారు.



దూసుకుపోతున్న ఇ- రేసింగ్ కార్లు

ఉత్కంఠకు తెర..

నగరంలో ఏర్పాటు చేసిన పోటీల కోసం ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. గత ఏడాది నవంబర్ నాటికే నెక్లెస్ రోడ్డులో 2.8 కి.మీ మేర ట్రాక్‌ను సిద్ధం చేయడంతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో రెండు దఫాలుగా ఇండియన్ రేసింగ్ కార్ పోటీలను నిర్వహించారు. ఫార్ములా-ఇ పోటీలకు వీటిని ట్రయల్స్‌గా భావించారు. మరోవైపు ఫార్ములా- ఇ గురించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. ఈ నెల మొదటి వారంలోనే మరోసారి ట్రాక్ పరిశీలనతో పాటు గ్యాలరీలు, బారికేడ్లు, పటిష్టమైన భద్రతా వ్యవస్థ వంటి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

- పోటీల్లో భాగంగా శుక్రవారం ట్రయల్స్ జరిగాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రయల్స్‌తో పాటు మధ్యాహ్నం క్వాలిఫైయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3.03 గంటలకు ప్రధాన పోటీ ఆరంభమైంది. గంటలకుపైగా ఉత్కంఠ భరితంగా సాగింది. మెరుపు వేగంతో ఒకదాన్ని మించి మరొకటి పరుగులు తీశాయి. 11 జట్లకు చెందిన 22 మంది రేసింగ్ డ్రైవర్లు తమ సత్తాను చాటుకొనేందుకు ప్రతి క్షణం పోటీపడ్డారు.

ఊడిపడిన విడిభాగాలు..

ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో పలుమార్లు రేసింగ్ కార్లు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. అపరిమితమైన వేగంతో దూసుకొచ్చిన కార్లు కొన్ని ట్రాక్‌ను దాటి వెళ్లాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఇలాంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. తెలుగుతల్లి చౌరస్తా వద్ద మలుపు తిరిగే క్రమంలో కార్లు ఒకదాన్నొకటి ఢీకొనడంతో కొన్ని కార్ల ముందు భాగంలోని విడిభాగాలు ఊడిపడ్డాయి. అయినా డ్రైవర్లు వాహనాలను ముందుకు దూకించారు. మరోసారి ఓ కారు డివైడర్‌కు ఢీకొట్టడంతో డ్రైవర్ దాన్ని నిలిపివేశారు. తెలుగుతల్లి చౌరస్తా వద్ద మలుపు విశాలంగా ఉన్నప్పటికీ నిర్దేశించిన ట్రాక్‌లోనే కారు నడపాల్సి ఉండడంతో డ్రైవర్లు కొందరు వాహనాలను అదుపు చేయలేక నిబంధనలకు ఉల్లంఘించడం గమనార్హం.

వెల్లువెత్తిన యువోత్సాహం...

ఈ పోటీలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో యువోత్సాహం వెల్లువెత్తింది, శనివారం వీకెండ్ కావడంతో ఐటీ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పిల్లలు సైతం సందడి చేశారు. రయ్‌మంటూ దూసుకొచ్చే కార్లను చూసి పిల్లలు, పెద్దలు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. పరుగెత్తే కార్లను తమ మొబైల్ ఫోన్‌లలో బంధించేందుకు పోటీ పడ్డారు. సెల్ఫీలు తీసుకున్నారు. లుంబిని పార్కు సమీపంలోని తెలంగాణ అమరుల స్మారకంతో సెల్ఫీలు తీసుకొనేందుకు ఉత్సాహం చూపారు. నగరానికి చెందిన మోటారు స్పోర్ట్స్ అభిమానులతో పాటు ముంబై, బెంగళూరు తదితర నగరాలకు చెందిన వారూ పెద్ద సంఖ్యలో ఉన్నారు.

అభిమాన క్రికెటర్ సచిన్‌తో రామ్‌చరణ్

రామ్‌చరణ్ తన అభిమాన క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌తో కలిసి ఈ- రేసింగ్‌ను వీక్షించారు. మొదటి నుంచి ఈ- ఫార్ములా రేస్‌ను నిర్వహించడానికి విశేష కృషి చేసిన రాష్ట్ర ఐటీ శాఖ యంత్రి కేటీఆర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



నటుడు అఖిల్, మహేష్‌బాబు కుమారుడు గౌతం



మంత్రి కేటీఆర్, ఆయన సతీమణి శైలిమ



దుల్కర్ సల్మాన్



ఆనంద్ మహీంద్రా



కేటీఆర్ తనయ అలేఖ్య, కుమారుడు హిమాన్షు



నిర్మాత అల్లు అరవింద్



ఏపీ మంత్రి అమర్నాథ్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి



జొన్నలగడ్డ సిద్దు, రామ్‌చరణ్, ఎంపీ సంతోష్‌కుమార్



సినీ నటులు నాగ చైతన్య, నాగార్జున

కానిస్టేబుల్‌పై ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల వీరంగం

- కేసు నమోదు చేసిన ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఉద్యోగి విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను దుర్భాషలాడిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టులో లైజనింగ్ అధికారిగా కానిస్టేబుల్ జెమ్యానాయక్ విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నతాధికారుల సూచన మేరకు నడవలేని స్థితిలో ఉన్న ప్రయాణికురాలి చెక్‌ఇన్ ప్రక్రియకు సహకరించేందుకు ఎమిరెట్స్ ఎయిర్‌లైన్స్ కౌంటర్ వద్దకు వెళ్లాడు. కొద్దిసేపు ఆగి చెక్‌ఇన్ ప్రక్రియను పూర్తి చేశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సంతోషిని అనే అధికారిణి కానిస్టేబుల్‌ను దుర్భాషలాడింది. అదే ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తున్న నిలేష్ అనే ఉద్యోగిని పిలిపించి మరోసారి కానిస్టేబుల్ జెమ్యానాయక్‌పై విరుచుకుపడింది. అతను విధి నిర్వహణలో ఉన్నట్లు పోలీస్ గుర్తింపు కార్డు చూపించినప్పటికీ పట్టించుకోకుండా బూతులు తిట్టారు. కానిస్టేబుల్ జెమ్యానాయక్ ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో లాల్‌దర్వాజా ఆలయ విస్తరణ పనులు



మాట్లాడుతున్న మంత్రి తలసాని

చాంద్రాయణగుట్ట: చారిత్రక లాల్‌దార్వాజా సింహవాహిని మహంకాళి ఆలయాన్ని త్వరలోనే విస్తరిస్తామని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ మేరకు మజ్లిస్ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట ఎమ్మెల్యే బలాలతో కలిసి శనివారం అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీలో భాగంగా ఆలయాన్ని 1100 గజాల విస్తీర్ణంలో రూ.9 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు.

నేర ప్రవృత్తి నుంచి యువతరాన్ని కాపాడుకోవాలి

- ఆలిండియా సూఫీ సజ్జాద్ నషీన్ కౌన్సిల్ క్యాంపెయిన్ షురూ

సాక్షి, సిటీబ్యూరో: హత్యా సంస్కృతి నుంచి యువతను కాపాడుకోవాలని సూఫీ సజ్జాద్ నషీన్ కౌన్సిల్ నిర్ణయించింది. మత్తు, మాదక ద్రవ్యాలకు బానిస అవుతున్న యువతను చైతన్యవంతులను చేసేందుకు నడుంబిగించింది. ఈ మేరకు శనివారం ప్రత్యేకంగా సమావేశమైన ముస్లిం మత పెద్దలు చెడు వ్యసనాల బారిన పడకుండా అవలంబించాల్సిన కార్యాచరణపై చర్చించారు. హుస్సైనీ ఆలంలోని కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షులు వహీద్ పాషా, సయ్యద్ షా ఔలియా హుస్సైనీ ముర్తజా పాషా, మౌలానా అహ్మద్ నక్ష్ బందీలతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. సిటీలో నేర సంస్కృతి మితి మీరిపోతోందని, యువతరం మాదకద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. యువతరాన్ని ఈ రుగ్మతల నుంచి కాపాడుకోకపోతే సమాజం నిర్వీర్యమవుతుందన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

- తరలివచ్చిన నిరుద్యోగ అభ్యర్థులు
- మేళాలో పాల్గొన్న 108 కంపెనీలు
- అర్హులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

హుడాకాంప్లెక్స్: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ధ్రువ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. యువజన, క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. గ్రేటర్ జిల్లాల నుంచి 30 వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో అత్యధికంగా యువతులే ఉండడం విశేషం. మొత్తం 108 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. రూ.15 వేల నుంచి రూ.50 వేల వేతనం ప్రకటించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలికి షామియానాలు కూలిపోగా అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై సరిచేశారు. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్న అభ్యర్థులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు



దివ్యాంగుడికి ఆఫర్ లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కుటుంబ పోషణ కోసం..



బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశాను. నా భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఒక్కడి సంపాదనతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. భర్తకు తోడుగా ఉండాలని భావించాను. చదువుకున్న చదువుకు తగిన ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో వచ్చాను.

– కవిత, తుర్కయంజాల్

ఆనందంగా ఉంది



బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ కోర్సు పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ఇప్పటికే చాలా కంపెనీల్లో ప్రయత్నించినా రాలేదు. ఇక్కడ నిర్వహించిన జాబ్‌మేళాలో బీజెడ్‌ఫైనాన్స్ సర్వీసెస్‌లో ఉద్యోగం వచ్చింది. జాయినింగ్ లెటర్ కూడా ఇచ్చారు. ట్రైనింగ్‌లో నెలకు రూ.11 వేల వేతనం అన్నారు. చాలా ఆనందంగా ఉంది.

– స్వాతి, సరూర్‌నగర్

ఫోన్ చేస్తామన్నారు



బీకాం కంప్యూటర్స్ పూర్తి చేశాను. మన్సూరాబాద్‌లోని దివ్యాంగుల హాస్టల్లో ఉంటున్నాను. ఉద్యోగం కోసం అనేక చోట్ల ప్రయత్నించాను. అయినా ఫలితం లేకుండా పోయింది. మరోసారి ప్రయత్నిద్దామని ఇక్కడికి వచ్చాను. రెస్యూమ్ ఇచ్చాను. ఫోన్ చేసి చెబుతామన్నారు.

– జగన్, దివ్యాంగుడు

ఉపాధి కల్పిస్తాం

మారుతున్న కాలానుగుణంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేనే ఇల్లు గడుస్తుంది. భవిష్యత్తులో దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తాం. చదువుకు చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా చాలా మంది పని చేస్తున్నారు. వారందరికీ ఆయా అంశాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం. ఎల్బీనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, మంత్రి

అవకాశాలు కల్పిస్తాం

జాబ్‌మేళాలో భాగంగా పాల్గొన్న 108 కంపెనీల్లో 13 వేల మందికి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. 30 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 16 జాబ్‌మేళాలు నిర్వహిస్తే అత్యధికంగా ఎల్బీనగర్ జాబ్‌మేళాకే అభ్యర్థులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో అవకాశాలు రాని వారికి భవిష్యత్తులో కల్పిస్తాం.

– సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎల్బీనగర్

ధరణితో తంటా.. గుండె మంట

వెల్లువలా భూ సమస్యలు

- న్యాయ శిబిరానికి తరలివచ్చిన రైతులు
- పరిష్కారం కావడంలేదంటూ కన్నీరుమున్నీరు
- భూ సర్వే చక్కని మార్గమన్న న్యాయ నిపుణులు



యాచారంలో నిర్వహించిన భూ న్యాయ శిబిరంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న న్యాయనిపుణులు

యాచారం: కేసీఆర్ సర్కార్ తెచ్చిన ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పెరుగుతున్నాయే కానీ, పరిష్కారం కావడంలేదని రైతులు వాపోతున్నారు. తమ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు వస్తాయా రావా?.. ధరణిలో తమ పేర్లు నమోదు అవుతాయోలేదోనని ఆందోళన చెందుతున్నారు. యాచారం మండల కేంద్రంలో శనివారం లీప్స్, గ్రామీణ న్యాయ పీఠం, సోషల్ మీడియా ఫోరం సంస్థ ఆధ్వర్యంలో భూ న్యాయ శిబిరం జరిగింది. ఈ శిబిరానికి ప్రముఖ భూచట్టాల నిపుణులు, న్యాయవాది, నల్సార్ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యులు సునీల్, మాజీ ఆర్డీఓ లచ్చిరెడ్డి, సోషల్ మీడియా ఫోరం రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పలువురు భూ చట్టాల నిపుణులు హాజరయ్యారు. ఈ భూ న్యాయ శిబిరానికి యాచారం, మంచాల, కందుకూరు, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి తమ భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ధరణి పోర్టల్‌లో భూ రికార్డులు నమోదు కావడం లేదని, పట్టా భూములు అసైన్డ్ భూములుగా రికార్డుల్లో మారాయని, ధరణిలో మా భూముల రికార్డులు కనిపించడం లేదని, పట్టా భూములకు బదులు భూదాన్ భూములుగా నమోదు అయ్యాయని, మా పట్టా భూములు ఇతర రైతుల పేర్ల మీద మార్చబడినట్లు, మా భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు ఇలా అనేక భూ సమస్యలపై న్యాయ శిబిరంలో రైతులు ఫిర్యాదులు చేశారు. భూ సమస్యలపై రెవెన్యూ అధికారులను కలిస్తే మీ సేవా కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోవాలని సలహాలిస్తే డబ్బులు చెల్లించి అప్పుల పాలవుతున్నామని, పైగా సమయం మొత్తం వృథా అవుతోందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. రైతుల ఫిర్యాదులపై భూ చట్టాల న్యాయ నిపుణులు సలహాలు, సూచనలు చేసారు. మేమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని స్వీకరించారు.

భూసర్వేనే చక్కని పరిష్కారం

భూసమస్యలకు చక్కటి పరిష్కారాం సమగ్ర సర్వే, హద్దులు గుర్తించడమేనని ప్రముఖ భూ చట్టాల న్యాయ నిపుణులు, నల్సార్ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యులు సునీల్ అన్నారు. 124 భూ చట్టాలు ఉంటే రాష్ట్ర సర్కార్ ధరణి చట్టాన్ని తెచ్చి మిగతా చట్టాలను పాతరేసిందని అన్నారు. మాజీ ఆర్డీఓ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో ప్రక్షాళన జరిగాల్సిందేనని అన్నారు.

రైతులను మోసం చేస్తున్న సర్కార్

ఏపీలో భూ సర్వే చేస్తూ, హద్దులు గుర్తిస్తూ రైతులకు టైటిల్‌తో కూడిన పట్టాదారు, పాసుపుస్తకాలు ఇస్తున్నారని, కానీ తెలంగాణలో మాత్రం ధరణి ఫోర్టల్ తెచ్చి రైతులను మోసం చేస్తున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు.

మా భూమి లేదంటా..



ఘల్కీజ్‌గూడ గ్రామంలో సర్వే నంబరు 133లో ఎకరా 29 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ధరణి పోర్టల్ రాకముందు పట్టాదారు, పాసుపుస్తకాలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో తమ భూమి రికార్డులు కనిపించడం లేదని అంటున్నారు. పలుమార్లు మీ సేవల్లో అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మాలాంటి పేదలకు ఇన్ని కష్టాలా.

– దేరంగుల కిష్టమ్మ, మల్కీజ్‌గూడ గ్రామం

రికార్డుల్లో మా పేరు మారింది



కొత్తపల్లి గ్రామంలో సర్వే నంబరు 120, 121లలో 2–13 ఎకరాల పట్టా భూమి నా భార్య యాదమ్మ పేరు ఉంది. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత సర్వే నంబరు 120లోని 1–3 గుంటల భూమి మా గ్రామానికి చెందిన కాసోజ్ రామాచారి పేరు రికార్డులో నమోదైంది. కాసోజ్ రామాచారి తన భూమి కాదని రాసిచ్చినా అధికారులు మార్చడం లేదు.

– కొండాపురం రాములు, కొత్తపల్లి

అసైన్డ్ భూమిగా నమోదైంది



యాచారం గ్రామ రెవెన్యూ పరిధిలో 190 ఆలో మా కుటుంబ సభ్యులకు 5–37 గుంటల పట్టా భూమి ఉంది. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఎకరా 20 గుంటల భూమి అసైన్డ్ భూమిగా పట్టాదారు, పాసుపుస్తకంలో నమోదైంది. పలుమార్లు అధికారులను కలిస్తే మీ సేవల్లో అర్జీలు పెట్టుకోమన్నారు. కానీ రికార్డుల్లో మారడం లేదు. రోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. అయినా ఏ అధికారి కరుణించడంలేదు.

– రెడ్డి వెంకట్‌రెడ్డి, యాచారం

భూదాన్ భూమిగా నమోదైంది



తాను ఓ మాజీ పోలీస్ అధికారినైనా తనకు కూడా ధరణి వల్ల సమస్య తప్పడం లేదు. మా కుటుంబ సభ్యులకు యాచారం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 72, 73, 74, 77, 78లలో 59–14 ఎకరాల పట్టా భూమి ఉంది. 1954 నుంచి 2017 వరకు కబ్జాలో ఉన్నాం. పట్టాదారు, పాసుపుస్తకాలు పొందాం. ధరణిలో ప్రస్తుతం భూదాన్ భూమిగా నమోదైంది. సీసీఎల్ఏ చుట్టూ తిరిగిన ఫలితం లేదు.

–రెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఏసీపీ

పాస్‌పోర్ట్ పోయినది

సలీమ్ పాషా సయ్యద్ తండ్రి సయ్యద్ ఇబ్రహీం, వయస్సు దాదాపు 52 సంవత్సరాలు, నివాసం: గ్రా॥ ఇందిరానగర్, మం॥ చౌదర్‌గూడెం, జిల్లా: రంగారెడ్డి-509207, తెలంగాణ వాసినైన నేను రెండు నెలల క్రితం రంగారెడ్డి జిల్లా నుండి హైదరాబాద్‌కు ఇల్లు మారే సమయంలో నా ఒరిజినల్ గడువుమీరిన పాస్‌పోర్ట్ నం.S749010 (05/09/1994- 04/09/2004) పోయింది. ఎంత వెతికినా సదరు పాస్‌పోర్ట్ ఆచూకీ తెలియరాలేదు. ఎవరికైనా దొరికినచో ఈ ఫోన్ నెంబర్ 9866290693 కు తెలియజేయగలరు.